క్లుప్తంగా

కీటక జనిత వ్యాధులను అరికట్టాలి



ఎర్రబురుజుకాలనీలో మురికికాలువలు పరిశీలిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): కీటక జనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, డెంగీ వ్యాధులను అరికట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన నగరంలోని ఎర్రబురుజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డ్రై డే- ఫ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. పట్టణ కేంద్రం పరిసరాల్లో ఇంటింటికి తిరిగి ఎక్కువ రోజులు నీటి నిల్వలు, మురుగులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనిపై నిర్లక్ష్యం వహిస్తే వ్యాధులు ముసిరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇంటి ఆవరణలో ఉన్న నీరు నిల్వ చేసే డ్రమ్ములు వారానికి ఒకరోజు ఖాళీ చేసి ఎండలో ఆరబెడితే అందులోని లార్వా చనిపోతుందని, దానివల్ల దోమలు పుట్టవన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భావన, హెల్త్ సూపర్‌వైజర్ జి.ఎల్లమ్మ, ప్రాజెక్టనిస్టు ఖలీల్, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు మైపర్ టెన్నిస్ అకాడమీకి చెందిన టెన్నిస్ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరచి ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో ఆదిమూలపు రీతూ జాస్మిన్, షేక్ ఆర్షియా, దేశం వైష్ణవిరాయ్, బాలుర విభాగంలో ఆదిమూలపు రిత్విక్ శ్యాముల్, దేశం సాయి శంకర్, సందీప్ వర్మ, ముప్పా హిమ వంశీ, ఎం.రామ్ ధీరజ్, ఇస్మాయిల్ బాషలు ఎంపికయ్యారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు, డీఎస్ఏ సిబ్బంది అభినందించి మెడల్స్ అందించారు.

వైద్యుల పరస్పర బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనకాలజి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి అనంతపురం మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు. అక్కడ అదే విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఉమాదేవి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు. పరస్పర బదిలీల్లో భాగంగా వీరిద్దరూ బదిలీ అయినట్లు సమాచారం.

బ్యాడ్మింటన్ పోటీలకు కానిస్టేబుల్ ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన కానిస్టేబుల్‌కు మెడల్ అందజేస్తున్న స్టేడియం చీఫ్ కోచ్

కర్నూలు (టౌన్): ఏపీ సీఎం కప్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరమేయర్ బీవై.రామయ్య గన్‌మెన్ కానిస్టేబుల్ వేణుగోపాల్ గౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆయనను చీఫ్ కోచ్ నటరాజరావు, సూపరింటెండెంట్ శేషఫణి మెడల్‌తో అభినందించారు. అలాగే తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మంచి ప్రతిభ చాటాలని మేయర్ ఆకాంక్షించారు.

పెండింగ్ అప్లికేషన్లను ఆమోదించాలి

కర్నూలు (న్యూటౌన్): జగనన్న చేదోడు పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన ఆమోదింపజేసి పూర్తి చేయించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఎంపీడీఓలను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న చేదోడు పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ అప్లికేషన్లను పరిశీలించారు. జగనన్న చేదోడు మూడవ విడత సాయాన్ని ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుందని తెలిపారు. లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన ఆమోదింపజేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు.

సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాలు

- వలంటీర్లకు చెబితే చాలు దరఖాస్తు చేస్తారు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



చిత్తారి గేరిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, వలంటీర్లకు చెబితే దరఖాస్తు చేస్తారని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన 7వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిత్తరివీధి సందుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరిస్తూ ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకొని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కష్టాలను స్వయంగా చూసి తెలుసుకున్న సీఎం జగన్ వాటి పరిష్కారానికే సంక్షేమ పథకాలు తెచ్చారన్నారు. ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా నేరుగా పథకాల నగదు లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ప్రజలకు సూచించారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలిసి చెప్పుకొని పరిష్కారం పొందవచ్చని, తనను కలిసేందుకు ఎవరి సహకారం అవసరం లేదని వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జుబేర్ అహ్మద్, నాయకులు నవీద్, పర్వేజ్, షోయబ్, అన్వర్, నజీర్, ఖలీల్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సిటీ మెడికల్ సెంటర్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని గడియారం ఆసుపత్రి సమీపంలో సిటీ మెడికల్ సెంటర్ పేరుతో ఏర్పాటు చేసిన క్లినిక్‌ను ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓల్డ్‌సిటీలో స్పెషాలిటీతో కూడిన వైద్యసేవలు కలిగిన మెడికల్ సెంటర్‌ను ప్రారంభించడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్థానిక ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఫీజులు వసూలు చేయాలని సూచించారు. న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కె.హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. ఈ కేంద్రంలో న్యూరాలజీ, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.చంద్రశేఖర్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి.స్నేహ, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ సి.ఆర్.తేజ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్లపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): కృష్ణా జిల్లా కేంద్రంగా బోగస్ డిప్లమో ఇన్ వెటర్నరీ సైన్స్ సర్టిఫికెట్లను నిరుద్యోగులకు విక్రయిస్తున్న ముఠాపై విచారణ జరపాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పలువురు నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ఫిబ్రవరిలో సచివాలయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రానుండడం, అత్యధికంగా పశుసంవర్ధకశాఖలో 4765 పోస్టులు ఖాళీగా ఉండడంతో బోగస్ సర్టిఫికెట్లను అమాయకులకు కట్టబెట్టేందుకు కొందరు పూనుకుంటున్నారన్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి బోగస్ సర్టిఫికెట్లపై విచారణ చేస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. మరోవైపు బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన తరువాత విచారణలో నిజాలు తెలిస్తే వారిని తొలగిస్తారన్న విషయాన్ని కొనుగోలు దారులు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, హుస్సేన్‌బాషా, ఠాగూర్ యాదవ్, సుధీర్, గోవిందు, ఇందిరా పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యంతో విజయం సాధించాలి



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాంటిస్సోరి విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయురాలు

కర్నూలు (టౌన్): క్రీడా నైపుణ్యంతో క్రీడల్లో విజయం సాధించాలని మాంటిస్సోరి విద్యా సంస్థ ప్రధానోపాధ్యాయులు రమాజ్యోతి, రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల పర్యవేక్షకులు ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక మాంటిస్సోరి విద్యా సంస్థల క్రీడా ప్రాంగణంలో 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17, అండర్-14 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన వారు మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడలో అత్యంత చురుకుదనంతో ప్రత్యర్థిపై విజయం సాధించాలన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. మంచి ప్రతిభ కనబరిచే క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, పీఈటీల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కర్నూలు కల్చరల్: డీఈఎల్ఈడీ పరీక్ష కేంద్రాన్ని డీఈవో రంగారెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ మెయిన్ పాఠశాలలో జరుగుతున్న డీఈఎల్ఈడీ పరీక్షల నిర్వహణను డీఈవో పరిశీలించారు. 30వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని సీఎస్, డీవోలకు సూచించారు. డీఈఎల్ఈడీకి 115 విద్యార్థులకు గాను 113 మంది, నగరంలోని ఐజీఎం, బీక్యాంప్ ప్రభుత్వ పాఠశాలల కేంద్రాల్లో నిర్వహిస్తున్నా టీపీటీ పరీక్షలకు 330 మందికి 260 మంది హాజరయ్యారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రంగారెడ్డి

ఆధునికీకరించిన భవనాల ప్రారంభం



సీపీఓ కార్యాలయంలో ఆధునికీకరించిన భవనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ సముదాయంలోని ఆధునికీకరించిన ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్ని ప్రణాళిక శాఖ రాష్ట్ర సంచాలకులు బి.గోపాల్, కలెక్టర్ పి.కోటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. అలాగే ఇక్కడే ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను కూడా ప్రారంభించారు. సీపీఓ కార్యాలయాన్ని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆధునికీకరించినట్లు వారు చెప్పారు. సిబ్బంది నిబద్ధత, అంకితభావంతో పనిచేసి శాఖకు మంచిపేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఈఈ మద్దన్న, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేసి ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని డీడీ జయమ్మను ఆదేశించారు.

శిథిలావస్థలో సోలార్ రూఫ్‌టాప్

- వాటివైపు కన్నెత్తి చూసే వారే కరువు
- తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేసిన నెడ్‌క్యాప్



కలెక్టరేట్‌పైన సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్



పగిలిన సోలార్ ప్యానల్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పరిపాలన కేంద్రమైన కలెక్టరేట్‌లో దాదాపు 10 ఏళ్ల క్రితం సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకున్నారు. కలెక్టరేట్‌కు వినియోగిస్తున్న విద్యుత్‌ను ఆదా చేసేందుకు గాను సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ కింద కలెక్టరేట్‌పైన 120 ప్యానల్స్ ఏర్పాటు చేశారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసిన తర్వాత నాలుగైదేళ్లపాటు వాటిని నెడ్‌క్యాప్ అధికారులు, సిస్టమ్స్‌ను అమర్చిన పోటాన్ కంపెనీ మెయింటెనెన్స్ చేశారు. తర్వాత కంపెనీ వీటివైపు కన్నెత్తి చూడటం మానేసింది. నెడ్‌క్యాప్ అధికారులు మాకు సంబంధం లేదు.. మెయింటెనెన్స్ బాధ్యత కలెక్టరేట్‌కు సంబంధం అంటూ చేతులెత్తేశారు. ఎవ్వరు పట్టించుకోకపోవడంతో సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ శిథిలావస్థకు చేరుకుంటోంది. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ఎంతమేర జరిగిందో కాని నిధులు మాత్రం రూ.కోటికిపైగా ఖర్చు అయ్యాయి. సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్స్‌పై దుమ్ము, దూళి పేరుకు పోకుండా ఏడాదికి రెండు, మూడు సార్లు క్లీనింగ్ చేయాలి. ఇది పనిచేస్తుందా.. లేదా అనే పట్టించుకునే వారు లేరు. దీంతో వీటికి అమర్చిన రాగి, అల్యూమినియం వైర్లు చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ప్యానల్స్ పగిలిపోతున్నాయి. ఆదిలో హడావుడి, తర్వాత నిర్లక్ష్యం నెలకొంటుడటంతో సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ పూర్తిగా మరుగునపడిపోయింది. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ సోలార్ రూఫ్‌టాప్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉంది.

పవన్... రాయలసీమ ఉద్యమం గురించి తెలుసా!

- సీమ ప్రజల పక్షాన ఒక్కసారి కూడా ప్రశ్నించలేదే
- రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

కర్నూలు(అర్బన్): రాయలసీమ ఉద్యమకారులను తోలు తీస్తానంటు మాట్లాడిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాయలసీమ ఉద్యమం గురించి తెలుసా ? అని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... వేర్పాటు వాద ఉద్యమాలు ఎందుకు పుడతాయో తెలియని పవన్‌కల్యాణ్ జనసేన పార్టీని ఎలా నడుపుతారన్నారు. రతనాలను రాశులుగా పోసి అమ్మిన రాయలసీమలో ఉద్యమాలు ఊరికే ప్రారంభం కాలేదన్నారు. తరతరాలుగా నాయకులు, పాలకులు రాయలసీమపై చూపిన తీవ్ర వివక్ష వల్ల రాయలసీమ ఉద్యమం పురుడు పోసుకుందన్నారు. రాయలసీమ ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేయాలని చేస్తున్న ఉద్యమాలకు ఎందుకు పవన్ మద్దతు పలకలేదన్నారు. ఇక్కడికి వచ్చిన సందర్భంలో నా మనసులో కర్నూలే రాజధాని అని మాట్లాడిన పవన్ శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేయాలని ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఏకపక్షంగా అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేస్తానన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదన్నారు. కరువు, కాటకాలతో దుర్భరమైన జీవితాలను గడుపుతున్న రాయలసీమ ప్రజల పక్షాన ఒక్కసారి కూడా ప్రభుత్వాలను ప్రశ్నించని పవన్‌కు రాయలసీమ ఉద్యమాల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సమావేశంలో పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అశోక్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ చాటాలి



రాష్ట్ర పోటీలకు ఎంపికైన హాకీ, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు


కర్నూలు (టౌన్): ఏపీ సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ చాటాలని స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ నటరాజరావు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో పురుషులు, మహిళలకు బాల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ, బ్యాడ్మింటన్ వంటి క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్‌కోచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా పోటీల వాతావరణం పెరిగిందన్నారు. ప్రతి జిల్లాలో ఏదో క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. ఏపీ సీఎం కప్ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వివిధ క్రీడాంశాల్లో విజేతలను ఆయన ప్రకటించారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్‌లో 10 మంది పురుషులు, 10 మంది మహిళలు బాక్సింగ్‌లో పురుషులు 11 మంది, బ్యాడ్మింటన్ సింగిల్స్ పురుషుల విభాగంలో ముగ్గురు డబుల్స్ విభాగంలో 1 జంట, హాకీలో 18 మంది పురుషులు, వెయిట్‌లిఫ్టింగ్‌లో 10 మంది పురుషులు, 10 మంది మహిళలు ఎంపికయ్యారు.

జమున మృతికి సంతాపం

కర్నూలు కల్చరల్: సుప్రసిద్ధ సీనియర్ నటి జమున మృతికి పలువురు కళాకారులు, సాహితీవేత్తలు, కళా సంస్థల ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసమూర్తి, ఆవుల బసప్ప, నగర అధ్యక్ష, కార్యదర్శులు అయ్యన్న, ఆవుల బసప్పలు సంతాపం ప్రకటించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు మండలం బి.తాండ్రపాడు సమీపంలోని ఓ ప్రయివేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి మహేష్ నాయుడు(17) చికిత్స పొందుతూ మృతి చెందారు. అనంతపురం జిల్లా యాడికి మండలం పచ్చమేకల పల్లె గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వెంకటేశ్వర్‌రావుకు కుమారుడు మహేష్ నాయుడు. ఓ కుమార్తె సంతానం. ఈ నెల 10వ తేదీన జరిగిన ప్రీ ఫైనల్ పరీక్షలు సరిగా రాయలేదని మనస్తాపంతో ఈ నెల 24న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆరోగ్య ప్రదాత.. ఆదిత్యుడు

- నేడు రథ సప్తమి
- వేడుకలకు సిద్ధమైన సూర్యనారాయణ స్వామి ఆలయాలు



సూర్యనారాయణ స్వామి ఆలయం

కర్నూలు కల్చరల్: మాఘ శుద్ధ సప్తమి రోజున సూర్య భగవానుని మకర రాశి ప్రవేశమే ఉత్తరాయణ సంక్రమణం, రథ సప్తమి పర్వదినం. ఈ రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకను జరుపుకుంటారు. రథసప్తమి రోజున సూర్యోదయ సమయంలో గ్రహ నక్షత్రాల సన్నివేశం 'రథం' ఆకారంలో ఉంటుందని అందుకే 'రథ సప్తమి' అని పేరొచ్చిందని పండితులు చెబుతారు. శుభ కరుడు, ఆరోగ్య ప్రధాత అయిత సూర్య భగవానుని జయంతి(రథ సప్తమి) వేడుకలు శనివారం నిర్వహించేందుకు జిల్లాలోని స్వామి ఆలయాలను సిద్ధం చేశారు.

ప్రత్యేకం కర్నూలు సూర్యనారాయణ స్వామి ఆలయం

కర్నూలు నగరంలో 2014లో ఈ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. గణపతి సచ్చిదానంద స్వామి ఇక్కడ దత్త పీఠాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులు తలా సెంటు భూమిని ఇచ్చారు. దాతలు ముందుకు రావడం సుమారు రూ.8 కోట్లతో ఆలయం నిర్మాణం జరిగింది. 2019లో రథ సప్తమి నాడే విగ్రహ ప్రతిష్ట చేశారు. మందిరంలో స్వామివారు ఛాయా దేవి, ఉషా దేవితో కలిసి భక్తులకు దర్శనం ఇస్తారు. ఆలయం పైన సప్తరథాలతో కదలి వచ్చే సూర్యనారాయణుడి విగ్రహం నలభై అడుగుల ఎత్తు ఉంది. ఈ విగ్రహం కర్నూలు నగరం అంతా కనిపిస్తుంది. ఆలయంలో పల, పైభాగం పురాణ ఇతిహాసాల సమాహారంతో ఉంటుంది. లోపలి గోడలపైన సూర్య నమస్కారాలకు చెందిన నమూనా విగ్రహాలు, పైకప్పు పైన పన్నెండు రాశులూ, నవగ్రహాలు, దశావతారాల రూపాలు ఉన్నాయి. గర్భగుడిలో సూర్య భగవానుడు పది అడుగులతో సప్త అశ్వాలతో భక్తులకు దర్శనమిస్తాడు. అరసవిల్లి సూర్య దేవాలయం తరువాత రెండో అతి పెద్ద సూర్య దేవాలయంగా ఇది గుర్తింపు పొందింది.

వేడుకల నిర్వహణ ఇలా..

కర్నూలు నగర శివారులోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో అభిషేకం, మహాసౌరయాగం, సామూహిక అనఘాష్టమీ వ్రతం, దత్త క్రియా యోగ తరగతులు, సూర్య నమస్కారాలు, ఛాయా దేవి, ఉషదేవి సహిత శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణం, స్వామి సుప్రభాతం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా దేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం ప్రాంగణంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో, నందికొట్కూరు పట్టణంలోని సూర్య నారాయణ స్వామి ఆలయంలో రథ సప్తమి వేడుకల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సూర్యారాధనతో ఆరోగ్యం సిద్ధిస్తుంది



ఉత్తరాయణం తరువాత వచ్చు మొదటి శుక్ల సప్తమే రథ సప్తమి అవుతుంది. ఉత్తరాయణంలో చేసే అన్ని రకాల పూజలు ఎంతో విశేషాన్ని కలిగి ఉన్నాయి. బ్రాహ్మీముహూర్తంలో జిల్లేడు ఆకులు లేదా రాగి ఆకులు తలపై పెట్టుకొని స్నానం చేస్తే శరీర, మానసిక రుగ్మతలు తొలగిపోతాయి. ఆదిత్యునికి అత్యంత ఇష్టమైన గోధుమ పాయసం చేసి ప్రత్యక్ష సూర్యనారాయణునికి నైవేద్యం పెట్టడం శ్రేయస్కరం. సూర్య నమస్కారాలు చేయడం ఆరోగ్య ప్రదాయం.

–వినయ్‌కుమార్ శర్మ, పండితుడు, సూర్యనారాయణ స్వామి ఆలయం

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



బ్రహ్మచారుల ఆరాధన చేస్తున్న దృశ్యం



నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకొని సుబ్రహ్మణ్య స్వామికి బ్రహ్మచారులకు విశేష ఆరాధనలు జరిపారు. స్వామివారికి అభిషేకం, సుదర్శన హోమం నిర్వహించారు. విజయవాడ భారతి రాఘవ నృత్యకేంద్రానికి చెందిన నృత్యకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. స్వామివారిని గజ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం సభ్యులు, మహిళా సేవాదల్, వాయుసేన సేవా దల్ సభ్యులు పాల్గొన్నారు.